www.prajasakti.com

ప్రజాశక్తి

శనివారం 9 డిసెంబర్ 2023

5

తూర్పుగోదావరి



నేడు జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని పలు కోర్టుల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ప్రత్తిపాడు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగల కోర్టుల్లో లోక్ అదాలత్‌లు నిర్వహిస్తున్నామని, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్ కేసులు, బ్యాంకు కేసులు, రాజీపడదగిన క్రిమినల్ కేసులు, ప్రీ-లిటిగేషన్ కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అన్నం పెట్టేదెలా..?

- పెండింగ్‌లో సంక్షేమ హాస్టళ్ల డైట్ బిల్లులు
- మెనూ అమలు కోసం వార్డెన్ల అప్పులు
- బిల్లులు ఎప్పుడొస్తాయోనని అయోమయం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలకు సకాలంలో బిల్లులు చెల్లించకపోవటంతో వార్డెన్లు అప్పులు చేసి విద్యార్థులకు భోజనం పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. చేసిన అప్పులు తీర్చేమార్గం లేకపోవటం..కొత్త అప్పులు పుట్టకపోవటంతో గత్యంతరం లేక వారి వారి బంగారు వస్తువులను బ్యాంకుల్లో కుదువబెట్టి మెనూను అమలు చేస్తున్నవారు సైతం ఉన్నారు. జిల్లాలో గత 4 నెలలుగా వసతి గృహాల్లో డైట్ బిల్లులు పెండింగులో ఉన్నాయి. డైట్ బిల్లులను ఉన్నతాధికారులను అడిగితే తమ చేతుల్లో ఏమీలేదని చేతులెత్తేయడంతో వార్డెన్ల పరిస్థితి అయోమయంగా మారింది. జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రీ మెట్రిక్, పోస్ట్ మెట్రిక్ కలిపి 35 వసతి గృహాలు ఉన్నాయి. ఈ వసతి గృహాల్లో 2,330 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లోని 3, 4 తరగతుల విద్యార్థులకు రూ.1,150, 5 నుంచి 10వ తరగతుల విద్యార్థులకు రూ.1,400 మెస్ ఛార్జీల రూపంలో ప్రభుత్వం చెల్లిస్తోంది. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలో ఆక్టోబర్ నెల నుంచి మెస్ ఛార్జీలను చెల్లించిన పరిస్థితి లేదు. ఓ వైపు సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవటం, మరోవైపు పెరిగిన నిత్యావసరాల ధరలతో ఈ ఛార్జీలు చాలడం లేదని వసతిగృహాల నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అప్పులతో అవస్థలు పడుతున్న వార్డెన్లు

ప్రభుత్వం సకాలంలో బిల్లులు విడుదల చేయకపోవటంతో వసతి గృహాల వార్డెన్లు అప్పులు చేసి అవస్థలు పడుతున్నారు. రాజమహేంద్రవరంలోని ఒక బిసి హాస్టల్‌లో 110 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి నెలా రూ.80,000 బిల్లులు విడుదల చేయాల్సి ఉంది. అక్టోబరు తర్వాత నాలుగు నెలలుగా నిధులు విడుదల చేయలేదు. అప్పు చేసి హాస్టల్‌లో విద్యార్థులకు భోజనం పెడుతున్నామని అక్కడి ఓ అధికారి వాపోయారు. కొన్ని సార్లు ఫింగర్‌ప్రింట్ సమస్యలు, మ్యాపింగ్, కోడ్ సమస్యల కారణంగా నిధులు జమ చేయటం లేదని సమాచారం. మరికొన్ని రోజులు సిఎఫ్ ఎంఎస్, బిల్లుల అప్‌లోడింగ్ సైట్ ఓపెన్ కాకపోవడం వంటి కారణాలతోనూ ఆలస్యం అవుతుందని వార్డెన్లు చెబు తున్నారు. ఇలా అనేక కారణాలతో బిల్లులు రాష్ట్రస్థాయికి చేరడం లేదని ఆయా శాఖల్లోని అధికారులు, వార్డెన్లు వాపోతున్నారు. ఈ విధంగా ప్రభుత్వం మూడు లేదా ఆరు నెలలకోసారి నిధులు విడుదల చేస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు గోరుచుట్టుపై రోకలి పోటులా మారాయి. గతేడాది కేజీ కందిపప్పు ధర రూ.110 కాగా ప్రస్తుతం రూ.160కు చేరింది. మంచినూనె లీటరు(పామాయిల్) రూ.69లు ఉండేది ప్రస్తుతం ఆ ధర రూ.90కి చేరింది. చింతపండు రూ.99 నుంచి రూ.180కి, పెసర పప్పు రూ.80 నుంచి రూ.140కు చేరింది. గ్యాస్ సిలిండర్ ధర రూ.850 నుంచి రూ.930కి చేరింది. పెరిగిన ధరలకు అనుగుణంగా డైట్ ఛార్జీలు పెంచాలని వార్డెన్లు కోరుతున్నారు.



రాజమహేంద్రవరంలో బిసి బాలుర వసతిగృహం

బిల్లులు ఎప్పుడు విడుదల చేస్తారో..!

పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఎప్పుడు విడుదలవుతాయో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. రాజమహేంద్రవరంలో ఓ ఎస్‌సి హాస్టల్ వార్డెన్ మూడు నెలలుగా అప్పులు తెచ్చి మెనూ అమలు చేస్తున్నారు. ఒక నెల రూ.4, రెండు నెలలు రూ.5 వడ్డీకి రూ.4 లక్షలు అప్పు చేసినట్లు తెలిపారు. ఈ నెల అప్పు కోసం వెళితే 'ఇచ్చిన అప్పు చెల్లించిన తరువాత కొత్త అప్పు ఇస్తాను' అని చెప్పారని ఆ వార్డెన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల ముగిస్తే ఇంట్లో బంగారం, వస్తువులు అమ్మి విద్యార్థులకు భోజనం పెట్టాల్సి వస్తుందని వాపోయాడు. మరోవైపు ప్రభుత్వం చెల్లించే ధరకు బయట మార్కెట్‌లో ఉన్న ధరకు భారీ వ్యత్యాసం ఉండడంతో ఏం చేయాలో వార్డెన్లకు పాలుపోవడం లేదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడితే ఉన్నతాధికారులు ఎక్కడ బాధ్యులు చేస్తారోనని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వాని 2021లో పోల్చితే రెండేళ్లలో ధరలు గణనీయంగా పెరిగాయి. ఈ పరిస్థితుల్లో అప్పటి ధరలకు అనుగుణంగా భోజనం అందించడం సాధ్యమా? అని వార్డెన్లు ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయాలని వార్డెన్లతోపాటు, విద్యార్థులు కోరుతున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఓటరు జాబితా పరిశీలకులు యువరాజ్, చిత్రంలో కలెక్టర్, జెసి, కమిషనర్

పారదర్శకంగా ఓటరు జాబితా

అధికారులకు పరిశీలకులు యువరాజ్ ఆదేశం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించాలని జిల్లా ఓటర్ల జాబితా పరిశీలకులు, పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్ ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో స్పెషల్ సమ్మరీ రివిజన్ 2024 పై ఎన్నికల నమోదు అధికారులతో సమీక్ష, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ కె. మాధవీలత, ఇతర నియోజకవర్గ ఇఆర్‌ఒలు, ఎఇఆర్‌ఒలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హేతుబద్ధత కలిగిన ఓటరు జాబితా రూపుదిద్దడంలో రాజకీయ పార్టీలు భాగస్వామ్యం అవ్వడం, ఓటు హక్కు వినియోగించేలా చైతన్యం ప్రజల్లో కల్పించాలని సూచించారు. జిల్లాలో 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటర్‌గా నమోదు లక్ష్యంగా ఓటర్ల జాబితా సవరణ చేపట్టడం జరగాలని అన్నారు ఓటు హక్కుతోపాటు రానున్న ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడమే లక్ష్యంగా విస్తృత స్థాయిలో అవగాహన దిశగా అడుగులు వేయడం ముఖ్యం అన్నారు. అధికారులు, రాజకీయ పార్టీలు కలిసి ఆమేరకు పని చేయాల్సి ఉంటుందన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు మార్పుల సవరణకు సంబంధించి ఎలాంటి చిన్న పొరపాట్లకు తావివ్వకుండా పారదర్శకంగా రికార్డులు నిర్వహించాలన్నారు. ఓటర్ల జాబితాలో చేర్పులు, మార్పులకు సంబంధించి ఆయా గ్రామ పంచాయతీలు, వార్డు సచివాలయల్లో నోటీసులను ఉంచాలని, అదేవిధంగా వాటిని వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. క్షేత్ర స్థాయి బిఎల్‌ఒలు, జిల్లా స్థాయి అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనకు కృషి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇపి రేషియో, జెండర్ రేషియో విషయంలో వాస్తవ పరిస్థితిని అంచనా వేసి ఆ మేరకు సిద్ధం చేయాలన్నారు. ఎఫ్‌పి షాప్‌లో రేషన్ కార్డులు కల్గిన 18 ఏళ్ల నిండిన వారి వివరాలు, ఆ పోలింగ్ కేంద్రంలో ఉన్న ఓటర్ల సంఖ్యతో పరిశీలించి ఆమేరకు హేతుబద్ధత కలిగిన ఓటరు జాబితా రూపొందించడంపై అధ్యయనం చేయా లన్నారు. ప్రతి నియోజక వర్గం పరిధిలో కనీసం ఐదు ఎఫ్‌పి షాప్‌ల పరిధిలో ఈ ప్రక్రియ చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలియచేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. మాధవీలత జిల్లాలో ఎస్ఎస్ఆర్-2024 రూపకల్పనపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 1,569 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 15,76,026 మంది ఓటర్లు ఉన్నారని, అందులో 7,71,192 మంది పురుషులు, 8,04,725 మంది మహిళలు, 109 మంది ఇతరులు ఉన్నారని కలెక్టర్ తెలి పారు. ఫారం 6, 7, 8లకు సంంధించిన క్లైములు 2,92462 రాగా, అందులో250096 పరిష్కరించడం జరిగిందన్నారు. మిగిలిన 42,366 దరఖాస్తులను గడువులోపు పరిష్కరించడం జరుగుతుందని వివరిం చారు. ప్రత్యేక శిబిరాల్లో మొత్తం 31,748 దరఖాస్తు వచ్చాయన్నారు. తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేసేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టడంతోపాటు అత్యంత పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ జరుగుతుందన్నారు. ఈనెల 26 నాటికి పూర్తిస్థాయిలో పరిష్కరించి, 2024 జనవరి 5న ఓటర్ల తుది జాబితాను ప్రచురించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జెసి ఎన్. తేజ్ భరత్, కమిషనర్ కె. దినేష్ కుమార్, డిఆర్ఒ జి.నరసింహులు, సహాయ కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, నియోజక వర్గ ఎన్నికల అధికారులు ఎ.చైత్రవర్షిణి, ఎబివిఎస్‌పి శ్రీనివాస్, కృష్ణ నాయక్, ఎమ్.ఝాన్సీరాణి, ఎస్. సరళా వందనం, ఎమ్. వెంకట సుధాకర్ పాల్గొన్నారు.

పశువులకు గొంతువాపు టీకాలు

ప్రజాశక్తి - చాగల్లు

తుపాను వల్ల పశువులకు వ్యాపించిన గొంతువాపు వ్యాధికి టీకాలు వేసే కార్యక్రమాన్ని స్థానిక పశువైద్యశాల వద్ద సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, వైస్ ఎంపిపి జజ్జవరపు రామచంద్రరావు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కొవ్వూరు డివిజన్ పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ జి.రాధాకృష్ణ పాల్గొని పశుసంవర్ధక శాఖ ద్వారా అమలు చేస్తున్న పథ కాలను పాడి రైతులకు వివరిం చారు. ఈ శిబిరంలో పాడి రైతులకు ఖనిజ లవణ మిశ్రమాలను, లివర్ టానిక్‌లను పంపిణీ చేశారు. 15 ఆవులు, 58 గేదెలకు వివిధ వ్యాధులకు సంబంధించి చికిత్సలు, గర్భకోశ వ్యాధిలకు సంబంధించి టీకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యు.ముఖేష్, డాక్టర్ ఎస్.సుజిత, వెటరినరీ అసిస్టెంట్ కె.రాజశేఖర్ వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ఎస్.అర్జునరావు, స్థానికులు సిహెచ్.దుర్గమల్లేశ్వరరావు, విజయలక్ష్మి, కరిష్మా పాల్గొన్నారు.



ఉత్తమ పురస్కారానికి మంగారాణి ఎంపిక

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం


స్థానిక శ్రీ నాగరాజా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పనిచేస్తున్న మోటూరి మంగారాణి సామాజిక మాధ్యమ ఉత్తమ ప్రభావశాలి పురస్కారానికి ఎంపిక య్యారు. తెలంగాణా రాష్ట్రానికి చెందిన ఎండ్ నౌ డిజిటల్ మీడియా సంస్థ హైద్రాబాద్, టి.హబ్‌లో డిసెంబర్ 17న నిర్వహించే కార్యక్రమంలో మంగారాణికి ఈ పురస్కారం అందుకోనున్నారు. "మంగారాణి లెస్సన్స్' పేరుతో విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వీడియో పాఠాలు బోధిస్తూ ఏడు కోట్ల 55 లక్షలకు పైగా వ్యూయర్‌షిప్ సాధించిన సంగతి విదితమే.

డ్వాక్రా మహిళలకు ఆటో రిక్షా అందజేత

ప్రజాశక్తి - బిక్కవోలు

ఉన్నతి మహిళా శక్తి పథకం ద్వారా ఎస్‌సి, ఎస్‌టి డ్వాక్రా మహిళలకు ఎంఎల్‌ఎ డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి శుక్రవారం ఆటో రిక్షా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ వైఎస్ఆర్ కెపి ద్వారా మంజూరు కాబడిన ఆటో రిక్షాను బిక్కవోలు గ్రామానికి చెందిన శ్రీ మహాలక్ష్మి మహిళా శక్తి సంఘం సభ్యురాలు బొండపల్లి లక్ష్మీకి ఆటో రిక్షా ను పంపిణీ చేయడం జరిగిందన్నారు

కార్టూ'నిజం'



స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం

ప్రజాశక్తి - కడియం

గ్రామ స్వపరిపాలనకు కావలసిన నిధులు ఇవ్వకుండా స్థానిక సంస్థలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తుందని ఎంఎల్‌ఎ గోరంట్ల బుచ్చయ్య చౌదరి ధ్వజమెత్తారు. శుక్రవారం కడియంలో ఎంపిపి వెలుగుబట్టి ప్రసాద్ ఆధ్వర్యంలో మాజీ జడ్‌పిటిసిలు, మాజీ ఎంపిపిలు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో గోరంట్ల మాట్లాడుతూ గ్రామ సచివాలయాల నిర్వహణ పట్ల ప్రభుత్వం ద్వంద్వ వైఖరి అవలంభిస్తోందన్నారు. గ్రామ పంచాయతీలకు సచివాలయాలతో ఏమాత్రం సంబంధం లేదని, ప్రజలతో ఎన్నుకోబడిన సర్పంచ్‌లను సిఎం జగన్ రెడ్డి ఉత్సవ విగ్రహాలుగా చేశారని విమర్శించారు. పంచాయితీలకు వచ్చే కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే వేలాది కోట్ల రూపాయలను పక్కదారి పెట్టించారని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసం వల్ల పంచాయితీ వ్యవస్థ నిర్వీర్యం అయ్యే పరిస్థితి వచ్చిందని విమర్శించారు. సర్పంచ్, వార్డుసభ్యులకు తెలియకుండా, పంచాయతీ బోర్డు తీర్మానం లేకుండా పంచాయతీ ఖాతాల నుంచి నిధులు మళ్లించడం ద్వారా స్థానికసంస్థల ప్రతినిధులను ప్రభుత్వం మోసం చేయడమేనని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు దోహదం చేసే జల జీవన్ మిషన్ పథకం నిలిచిపోయిందని తెలిపారు. ఈ ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో గ్రామాల్లో రోడ్డు కాని, కాలువలు కానీ నూతనంగా వేసిన పరిస్థితి లేదన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో డ్రైనేజీ, తాగునీటి వ్యవస్థ అధ్వానంగా మారిపోయిందని అన్నారు. ఆఖరికి పంచాయతీలో బ్లీచింగ్ వేయడానికి కూడా డబ్బులు లేని స్థితిలో పంచాయతీ వ్యవస్థను దిగజార్చిసేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరిగి టిడిపి ప్రభుత్వం ఏర్పాటుతోనే పంచాయితీలకు పూర్వవైభవం వస్తుందని అన్నారు. పంచాయితీలకు నిధులతోపాటు, విధులను సక్రమంగా నిర్వర్తించే అవకాశం టిడిపి పాలనలోనే సాధ్యమని, ఇప్పటినుంచే గ్రామాల అభివృద్ధిపై టిడిపి ప్రణాళికను సిద్ధం చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వెలుగుబంటి రఘురామ్, రూరల్ మండలం టిడిపి అధ్యక్షులు మచ్చేటి ప్రసాద్, నాయకులు ఎం.సత్యనారాయణ, పి.రామారావు చౌదరి, ఎం.సత్యవతి, జి.సత్యనారాయణ, వి.నాగబాబు, కృపారావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ గోరంట్ల

పంట నష్టపోయాం ఆదుకోండి

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

తుపాను ప్రభావంతో పంటను నష్టపోయామని, ప్రభుత్వం తక్షణమే తమను ఆదుకోవాలని ఉండ్రాజవరం, తాడిపర్రు గ్రామాల రైతులు గోపా గోపాలం, చిన్న రాజా, వెంకట్రావు, శ్రీనివాసు, కరుటూరి వెంకట సూర్యనారాయణ, కరుటూరి వెంకట చౌదరి, బందుల విశ్వేశ్వరరావు, అక్కాబత్తుల సత్యనారాయణ, అరిగెల సుబ్రమణ్యం కోరారు. పంట నష్టంను అంచనా వేసేందుకు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు శుక్రవారం ఆయా గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులు తమకు జరిగిన నష్టంపై అధికారులకు వివరించారు. ఈ సందర్భంగా ఉద్యానవన, వ్యవసాయ శాఖ అధికారులు సిహెచ్.శ్రీనివాస్, ఎం.విశ్వాసరావు మాట్లాడుతూ తుపాను కారణంగా నాలుగు రోజులపాటు కురిసిన వర్షాలతో సుమారు 300 ఎకరాల్లో వరి, 20 హెక్టార్లలతో అరటి, కూరగాయల పంట దెబ్బతిన్నట్లు ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ప్రస్తుతం వరిచేల నుంచి వర్షపునీరు బయటకు వెళ్లిపోయినప్పటికీ, చేనులోకి కోత యంత్రం వెళ్లే అవకాశం లేదని, పంట కోతకు ఇంకా కనీసం 10 నుంచి 15 రోజులు సమయం పడుతుందని తెలిపారు. మండలంలోని కె.సావరం, మోర్త గ్రామాల్లో అధిక శాతం అరటి తోటలు, దమ్మెన్ను, వేలివెన్ను గ్రామాల్లో కూరగాయల పంట నష్టం కలిగినట్లు చెప్పారు. ఈ పర్యటనలో ఎంపిఇఒ ఇంజేటి నాగమణి, సిద్ధాని జగదీశ్వరి ఉండ్రాజవరంలో వరి పంట నష్టాన్ని పరిశీలించారు.


పంట నష్టాన్ని తెలుసుకుంటున్న సచివాలయ సిబ్బంది

ప్రభుత్వ వైఫల్యం వల్లే రైతులకు కష్టాలు

ప్రజాశక్తి - తాళ్లపూడి

తుపాను నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంలోనూ, రైతులను అప్రమత్తం చేయడంలో ప్రభుత్వ వైఫల్యం వల్లనే నేడు రైతులు కష్టాల పాలయ్యారని టిడిపి యువగళం నాయకులు కాకర్ల సత్యేంద్ర, టిడిపి మండల రైతు సంఘం అధ్యక్షులు అన్న మరెడ్డి సత్తిబాబు ధ్వజమెత్తారు. మండలంలో పలు ప్రాంతాల్లో తుపాను ప్రభావంతో పంటలు నాశనం అయిన నేపథ్యంలో యువగళం ఆధ్వర్యంలో బృందాలుగా వివిధ ప్రాంతాల్లో వారు పర్యటించారు. పంట నష్టపోయిన రైతులను కలుసుకుని వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తేమను బట్టి తరుగు అడుగుతున్నారని, ఇది ఎవరి లోపమూ అర్థం కావడం లేదన్నారు. పంట నష్టానికి ఎకరాకు రూ.30 వేలు చొప్పున రైతులకు నష్ట పరిహారాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ పర్యటనల్లో కాకర్ల సత్యనారాయణ కూచిపూడి గణేష్, అనపర్తి ప్రసాద్, చెన్న సత్యనారాయణ, తొండెపు భరత్, మద్దుకూరి శంకర్, దుద్దిపూడి గాంధీ, దుగ్గిరాల శ్రీను, పి.రాజు, ఆర్.పండు, వై శ్రీను, సత్యనారాయణ, పి రమణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


నీటిలో మునిగిపోయిన పంటను చూపుతున్న యువగళం నాయకుడు సత్యేంద్ర

నేటి నుంచి వెయిట్ లిఫ్టింగ్ పోటీలు


విద్యార్థులకు సూచనలు ఇస్తున్న విసి పద్మరాజు

ప్రజాశక్తి - రాజానగరం

ఆదికవి నన్నయ యూనివర్సిటీలో నేటి నుంచి సౌత్ అండ్ వెస్ట్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ మెన్ అండ్ ఉమెన్ ఛాంపియన్ షిప్ 2023 -24 నిర్వహిస్తున్నామని విసి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శుక్రవారం యూనివర్సిటీలో వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్‌కు సంబంధించిన ఏర్పాట్లును ఆయన పరిశీలించారు. ప్రత్యేక శ్రద్ధతో అన్ని కమిటీల కోఆర్డినేటర్లు, టెక్నికల్ అఫీషియల్స్, టీమ్ మేనేజర్స్ అండ్ కోచ్‌లకు తగిన సూచనలను చేశారు. సమష్టిగా కృషి చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, గుజరాత్, గోవా రాష్ట్రాల్లోని సుమారు 90 యూనివర్శిటీల నుంచి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు.. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఔనత్యాన్ని పెంచే విధంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు.

బాధితులకు నిత్యావసర సరుకుల పంపిణీ


బాధితులకు నిత్యవసర సరుకులు పంపిణీచే ఏస్తున్న బాబూరావు, తదితరులు

ప్రజాశక్తి - తాళ్లపూడి

పునరావస కేంద్రాల్లో ఉన్న తుపాను బాధితులకు నిత్యవసర సరుకులను పంపిణీ చే శారు. తుపాన్ కారణం గా ప్రక్కిలంక, పైడిమెట్ట గ్రామాల్లో ఏర్పాటుచేసిన పునరావాస శిబిరాల్లో తలదాచుకుంటున్న 28 కుటుంబాలకు ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, సర్పంచ్ స్వప్న ఆదేశాలతో ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, ఇతర నిత్యవసర సరుకులు, కూరగాయలను కొవ్వూరు నియోజకవర్గ వైసిసి ఎస్‌సి విభాగం అధ్యక్షులు యాళ్ల బాబురావు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకుడు కొల్లి.దుర్గారావు, విఆర్ఒ విజయ కుమారి, వాలంటీర్లు రాధిక, నక్షత, సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలపై అవగాహన


వైద్య సేవలందిస్తున్న 104, 108 సిబ్బంది

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని చినకొండేపూడిలో 104, 108 అంబులెన్స్ అందుస్తున్న సేవలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఇఎంటి టి.సునీత, పైలట్ మణికుమార్ 108 సేవల సేవల యొక్క ఉప యోగాలను ప్రజలకు వివరిం చారు. 108 సేవలను ఏవిధంగా అందిపుచ్చుకోవాలనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే వైద్య శిబిరంలో రోగులకు వైద్య సేవలు అందించారు.

కులగణన సక్రమంగా నిర్వహించాలి

ప్రజాశక్తి - గోకవరం



సమావేశంలో మాట్లాడుతున్న వీరబాబు

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణన సక్రమంగా జరిపి నమోదు చేయాలని గోకవరం మండల ఎంపిడిఒ కె.పద్మజ్యోతి అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాల యంలో కుల గణనపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైసిపి నాయకులు సుంకర వీరబాబు మాట్లా డుతూ సమగ్ర కుల గణనతో సామాజికంగా, ఆర్థికంగా, వెనుకబడిన వర్గాలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కులగణనతో జనాభాలో అత్యధిక శాతం ఉన్న బిసి సామా జిక వర్గాలతోపాటు ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వర్గాలకు న్యాయం జరుగుతుందని వివరిం చారు. కులగణన నమోదులో ఎటువంటి అవకతవకలు లేకుండా నమోదు చేయాల న్నారు. ఈ సమావేశంలో తహాశీల్దార్ ఎ.శ్రీనివాస్, ఇఒపిఆర్‌డి ఎం.రాజేశ్వరరావు, ఎంఇఒలు బి.గౌరమ్మ, చిమ్మరాజు దొర పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - చాగల్లు

తుపాన్ వల్ల నష్టపోయిన రైతంగానే ప్రభు త్వం వెంటనే ఆదుకో వాలని తూర్పుగోదావరి జిల్లా రైతు సంఘం కన్వీనర్ గారపాటి వెంకటసుబ్బారావు శుక్రవా రం ఓ ప్రకటనలో కోరారు. కొవ్వాడ కాలవలో గుర్రపు డెక్క తొలగించక పోవడంతో వంతెన వద్ద అడ్డుపడి పల్లపు ప్రాంతాల్లోని పొలాలు మునిగి రైతులు నష్టపోతున్నారని అన్నారు. డిస్కలరీ పొంత రోడ్డు (లంక పొలం) కాలువపై ఉన్న వంతెన ఇరుకుగా ఉండడంతో గుర్రపు డెక్క అడ్డుపడి రైతుల పంటను పాడుచేస్తుందని అన్నారు. తక్షణమే కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రబీ సాగుకు సిద్ధమైన రైతులు ఆకు కోసం విత్తనాలు వేశారని, తుపాను వల్ల ఆకు మొత్తం నాశనం అయ్యిందని, తక్షణమే ప్రభుత్వం రైతులకు విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలని ఆయన కోరారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - కిర్లంపూడి

బూరుగుపూడి నుంచి రామవరం జాతీయ రహదారి పక్కన గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. స్థానికులు కిర్లంపూడి పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్ఐ పి.ఉమామహేశ్వరరావు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - కొత్తపేట

మండలంలోని కమ్మిరెడ్డిపాలెం మలుపు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడ్డాడు. కొత్తపేట ఎస్ఐ డి.జ్యోతిసాగర్ తెలిపిన వివరాల మేరకు అంబాజీపేట మండలం చిరతపూడికి చెందిన ఉండ్రాజావరపు శేఖర్ రావులపాలెంలో జెసిబి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలానే శుక్రవారం పని పూర్తిచేసుకుని ఇంటికి తన బైకుపై బయలుదేరాడు. కమ్మిరెడ్డిపాలెం మలుపు వద్దకు వచ్చేసరికి ప్రయివేటు ట్రావెల్స్ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో శేఖర్ తీవ్రంగా గాయపడ్డాడు. అతని వెంటనే 108లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం తీసుకెళ్లారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఉచిత పశు వైద్య శిబిరం



మందులను పంపిణీ చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి - పెరవలి

మండలంలోని ముక్కామల గ్రామంలో శుక్రవారం తుఫాను ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచిత పశు వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. పశు వైద్యులు వానపల్లి చరణ్ ఫణీంద్ర, పి .శ్రీనివాస్ వర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో పాడి పశువులకు సాధారణ చికిత్సలు, గర్భకోశ వ్యాధి చికిత్స, గొంతు వాపు వ్యాధి, జబ్బ వాపు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కేతా త్రిమూర్తులు, వైస్ ఎంపిపి వేండ్ర శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు గండేపల్లి రామకృష్ణ, జెవిఒ ఎఆర్.సోమేశ్వరి, పశు వైద్య సహాయకులు రాజశేఖర్, నరేంద్ర, సాయి, భవానీ పాడి రైతులు పాల్గొన్నారు.

మండలానికి 66 బోర్లు మంజూరు

ప్రజాశక్తి - చాగల్లు

వైఎస్ఆర్ జలకల పథకంలో మండలానికి 66 బోర్లు మంజూరైనట్లు ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒ పి.నిర్మలకుమారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 34 బోర్లు సంబంధించి మోటర్లు, పైపులు తదితర సామాగ్రి రైతులకు అందించినట్లు చెప్పారు. మిగిలిన బోర్లు కూడా మోటర్లు సంబంధించి సామాగ్రిలు త్వరలో వస్తాయని, రైతుల ఆందోళన చెందవద్దని అన్నారు.

రంగుమారిన ధాన్యం కొనుగోలుకు చర్యలు



ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

తుపాన్ నేపథ్యంలో రంగు మారిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఖరీఫ్ 2023-24 రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తి స్థాయిలో సేకరించేందుకు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఖరీఫ్ అంచనా వేసిన వరి సేకరణ 2.52 లక్షల మెట్రిక్ టన్నులని తెలిపారు. శుక్రవారం నాటికి ధాన్యం సేకరణకు 27,598 కూపన్‌లను జనరేట్ చేసినట్లు వివరించారు. 17,523 మంది రైతుల నుండి 1,25,031.760 మెట్రిక్ టన్నుల ధాన్యంను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలుకు సంబంధించి 16,332 ఎఫ్‌టిఒలకు గాను రూ.170 కోట్ల 26 లక్షలను రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఎంఎస్‌పి కంటే తక్కువ ధరకు ధాన్యంను దళారులకు, మిల్లర్లకు అమ్మవద్దని అన్నారు. ప్రభుత్వమే పూర్తి స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందని, రంగు మారిన ధాన్యా న్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తాదని తెలిపారు. మిల్లర్స్ అక్ర మంగా దిగుమతి ఛార్జీ ల కింద ఆన్లోడ్ ఛార్జీ లు క్రింద డబ్బులు వసూలు చేయకుండాగాను రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయుటకు చర్యలు చేపట్టబడినవి. ధాన్యం అమ్ముకొను విషయంలో మిల్లర్లను, మధ్యదళారులను కాని కలవాల్సిన అవసరం లేదన్నారు. ఆర్‌బికె, ఎఫ్‌టిఒ, ట్రక్ షీట్ తీసుకున్న రైతులు నేరుగా ఇంటికి వెళ్లిపోవచ్చున్నారు. రైలు మిల్లుల్లో అన్‌లోడ్ చేసిన రశీదును ప్రభుత్వమే తీసుకుంటుందని తెలిపారు. ఆర్‌బికెలకు ధాన్యంను అమ్మిన తరువాత ఏదైనా అనుమానం ఉంటే రైతులు టోల్ ఫ్రీ నెం.1967కు ఫోన్ చేసి వివరించాలని జెసి సూచించారు. జిల్లాకు అవసరమయ్యే 63,00,000 గోనె సంచులు ఇప్పటికే 55,82,567 గోనె సంచులు 232 ఆర్‌బికెలకు చేర్చినట్లు తెలిపారు. మద్దతు ధర కామన్ వెరైటీకి రూ.2,183, గ్రేడ్ 'ఎ'కు రూ.2,203 చెల్లించడం జరుగుతుందని అన్నారు. రైతులకు ధాన్యం రవాణాకు సంబంధించి గోనె సంచుల వినియోగ ఛార్జీలు రూ.3.39 పైసలు, హమాలీ ఛార్జీలు ఒక క్వింటాకు రూ.17.17 చొప్పున ప్రభుత్వం ద్వారా చెల్లిస్తామన్నారు. రైతులకు అవసరమైన అన్ని వసతులు కూడా అందుబాటులోకి తేవడం జరిగిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు వ్యవహారంపై ఎటువంటి ఫిర్యాదులు ఉన్నా కలెక్టర్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ నంబర్లు 8309487151, 0883-2940788లకు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ తెలియచేయవచ్చునని తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గోపాలపురం



లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న ఎఇ

జగనన్న లేఅవుట్లు, ఆవాస యోజన లబ్ధిదారులు ఇంటి నిర్మాణాల పనులను వేగంగా పూర్తి చేయాలని సర్పంచ్ యండపల్లి శేఖర్ బాబు లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం మండలంలోని సగ్గొండ పంచాయతీలో జగనన్న లేఅవుట్లు, ఆవాస యోజన లబ్ధిదారులతో హౌసింగ్ ఎఇ ఒ. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జగనన్న లేఅవుట్లు లబ్ధిదారులు 317, ఆవశ యోజన లబ్ధిదారులు 184 మొత్తం 501 ఉన్నట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో 17 మంది ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారని, మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. బిల్లులు మంజూరులో ఎక్కడా ఆలస్యం కావడం లేదని, ఎప్పటికప్పుడు బిల్లులను చెల్లించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో కార్యదర్శి అనురాధ, వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - సీతానగరం



వరి పంటను పరిశీలిస్తున్న బొడ్డు

తుపాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం అయ్యిందని రాజానగరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆరోపించారు. కోరుకొండ, సీతానగరం మండలాల్లో పర్యటించారు. వరి, పొగాకు పంటలకు చెందిన రైతులను ఆయన కలుసుకుని మాట్లాడారు. పెట్టుబడి, వ్యవసాయానికి జరిగిన నష్టంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాన్ హెచ్చరికలను వాతావరణ శాఖ ఇచ్చిన ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని, రైతులను అప్రమత్తం చేయడంలో విఫలం అయ్యిందన్నారు. నియోజకవర్గంలో సకాలంలో సంబంధిత ఆయకట్టుకు నీటిని సరఫరా చేసివుంటే రైతులకు ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. పంటను కోసి పనలపై ఉన్న పంట అంతా నాశనం అయ్యిందని, రైతుల పరిస్థితి చూస్తే ఆవేదన కల్గుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మేల్కొని నష్ట పరిహారాన్ని తక్షణమే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.

నేడు మన చైతన్య వన సమ్మేళనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అజ్జరపు వాసు, గుబ్బల రాంబాబు

ప్రతి ఏడాది మాదిరిగానే ఎస్‌సి, ఎస్‌టి, మైనారిటీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో నేడు నిర్వహిస్తున్న మన చైతన్య వన సమ్మేళనం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వేదిక ఛైర్మన్ గుబ్బల రాంబాబు, కన్వీనర్ అజ్జరపు వాసు పిలుపునిచ్చారు. జాతీయ రహదారిలోని బెస్ట్ ప్రైస్ పక్కన గల చెరుకూరి గార్డెన్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మన చైతన్య వన సమ్మేళనం కార్యక్రమం ప్రారంభం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి కమిషన్ ఛైర్మన్ ఎం విక్టర్ ప్రసాద్, తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ జి జానకి షర్మిల, తూర్పు గోదావరి జిల్లా అడిషనల్ ఎస్‌పి పి సోమశేఖర్, జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ శ్రీకృష్ణ, ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ బి.ప్రసాద్ రావు, ఎపి ఇపిడిసిఎల్ జనరల్ మేనేజర్(విశాఖ) తిలక్ కుమార్, ఎపి ఇపిడిసిఎల్ తూర్పు గోదావరి జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నక్కపల్లి సామ్యూల్, డిప్యూటీ చీఫ్ కంట్రోల్ ఆఫ్ అకౌంట్స్ విడి.సర్వేశ్వరరావు, ఎపి స్టేట్ హజ్ కమిటీ ఛైర్మన్ బిఎస్.గౌస్ లజామ్, ప్రజా గాయకుడు, దక్షిణ భారతదేశ సమత సైనిక్ ఉపాధ్యక్షులు షాన్ రేంజర్ల రాజేష్ పాల్గొం టున్నారని తెలిపారు. అంబేద్కర్ ఆలోచన విధానంతో దళిత గిరిజన మైనార్టీలను ఐక్యం చేసే లక్ష్యంతో గత ఏడేళ్లుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో రాజకీయాలకు అతీతంగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కొంతమూరు షానా, యాదల సతీష్ చంద్ర స్టాలిన్, బోర్రా చిన్ని, కప్పల వెలుగు కుమారి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - గోకవరం



రైతు నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో ప్రభుత్వం విఫలం అయిందని టిడిపి మండల రైతు విభాగం అధ్యక్షుడు చింతల రామకృష్ణ విమర్శించారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా రైతులు కష్టాల్లో మునిగిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని ప్రకటించినా నేటికీ ఆ ధాన్యం కొనుగోలును ప్రారంభించలేదన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవటం మానేసి మాటల గారడి చేస్తుందని అన్నారు. రైతులు కష్టాల్లో ఉంటే అధికార యంత్రాంగం మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. అధికారులు త్వరితగతిన పంట నష్టం అంచనా వేసి రైతులకు నష్టపరిహారం ఇచ్చేలా దృష్టి సారించాలని హితవు పలికారు.



రైతులతో మాట్లాడుతున్న ఎంఎల్ఎ జక్కంపూడి రాజా

ముంపు ప్రాంతాల్లో ఎంఎల్ఎ పర్యటన

ప్రజాశక్తి - సీతానగరం

తుపాను ప్రభావిత ముంపు ప్రాంతాల్లో ఎంఎల్ఎ జక్కంపూడి రాజా శుక్రవారం పర్యటించారు. మండలంలో కాటవరం, ముగ్గళ్ళ, రఘుదేవపురం, రాపాక, ఇనగంటివారిపేట, చినకొండేపూడి, కూనవరం తదితర ప్రాంతాల్లోనూ, కోరుకొండ మండలంలో కోటికేశవరం, శ్రీరంగపట్నం, మునగాల గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టించి పండించిన పంటలకు తుపాను ప్రభావంతో తీవ్ర నష్టం వాటిలిందన్నారు. నష్టపోయిన రైతులకు మానవత్వంతో వ్యవహరించాలని సిఎం ఆదేశించారని తెలిపారు. రంగు మారిన, తడిచిన, తేమ శాతం ఎక్కువగా ఉన్నా ధాన్యాన్ని కొనుగోలును ఆఫ్‌లైన్‌లో సేకరించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ప్రతిపక్ష పార్టీలు అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నాయని అన్నారు. చినకొండేపూడి గ్రామానికి చెందిన సత్యనారాయణ ఇల్లు కూలిపోవడంతో తక్షణ సాయంగా ఆయన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు.



రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి మాధవరావు

కొవ్వాడ కాలువకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి - గోపాలపురం

కొవ్వాడ కాలువకు శాశ్వత పరిష్కారం కొరకు కృషి చేస్తామని జిల్లా వ్యవసాయ అధికారి ఎస్ మాధవరావు తెలిపారు. శుక్రవారం మండలంలోని చిట్యాల, భీమోలు గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కొవ్వాడ కాలువ వల్ల సమీప గ్రామాల్లో కూడా నష్టం వాటిల్లుతుందని, ప్రతి సంవత్సరం ఈ విధంగా రైతులకు పరిహారం ఇచ్చేలా కాకుండా శాశ్వతంగా ఈ సమస్య నుంచి బయట పడేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చే రూ.6 వేలు రైతులకు ఎటువంటి ఉపయోగం ఉండదని, ఎకరాకు రూ.35 వేల నుంచి రూ.40 వేలు వరకూ ఖర్చుయిందని తెలిపారు. కొవ్వాడ కాలువ నుంచి విముక్తి చేయాలని రైతులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు చెప్పిన ప్రతి సమస్యను జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో చర్చించి వాటిని అమలు అయ్యేందుకు తమ వంతు కృషి చేస్తానని అన్నారు. వరి పైరు నీటిలోనే ఉండటంతో ఇప్పటికే మొలకలు వచ్చాయని, వీటిని కోత కోసి దాన్ని కొనుగోలు కేంద్రాలకు అమ్మడం కష్టతరమని అభిప్రాయపడ్డారు. ఈ పర్యటనలో ఎఒ బి.రాజారావు, రైతులు పీతల ప్రసాద్, ముచ్చికర్ల రవి పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి



గ్యారెంటీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆదిరెడ్డి శ్రీనివాస్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాష్ట్ర ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే అది టిడిపి అధినేత చంద్రబాబు గ్యారెంటీతోనే సాధ్యమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన అర్బన్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ అత్తిలి సత్యనారాయణ (అనుశ్రీ సత్యనారాయణ) అన్నారు. టిడిపి-జనసేన కూటమి నేతృత్వంలో స్థానిక 10వ డివిజన్లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, స్థానిక నాయకులు వాసిరెడ్డి బాబీ ఆధ్వర్యంలో టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు పర్యవేక్షణలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్రం బాగుపడాలంటే టిడిపి అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అధికార పార్టీ నాయకులు చేపడుతున్న దౌర్జన్యాలు, దోపిడీలను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం అప్పుల పాలయ్యిందన్నారు. ఇలాగే మరోసారి అతనికి అవకాశం కల్పిస్తే రాష్ట్రం సర్వనాశమవుతుందన్నారు. నరకాసురుని పాలనకు చరమగీతం పాడుదామన్నారు. రాష్ట్రం అభివద్ధి చెందాలంటే మళ్లీ సీఎంగా చంద్రబాబునాయుడు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన పార్టీలకు చెందిన నాయకులు, మాజీ కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

నగదు, నిత్యవసర సరుకులు అందచేత



బాధితులకు సరుకులు అందిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - గోపాలపురం

తుపాన్ ప్రభావంతో దెబ్బతిన్న ఇళ్ల బాధితులకు నష్ట పరిహారంతోపాటు, నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ట్రైనీ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శుక్రవారం మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాక్షికంగా 17 గృహాలు దెబ్బతిన్నాయని, అలాగే మరో గృహాల్లోకి వర్షపు నీరు వెళ్లిందని తెలిపారు. మొత్తం 34 మంది బాధితులకు నిత్యసవర సరుకులు, బియ్యం అందించినట్లు తెలిపారు. వీరిలో గృహాలు పడిపోయిన 17 మందికి నిత్యవసర సరకులతోపాటు, రూ.10 వేలు నష్ట పరిహారాన్ని అందించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శిరీష, వైస్ ఎంపిపి బాదిన వెంకటేశ్వరమ్మ, స్పోర్ట్స్ డైరెక్టర్ వరలక్ష్మీ, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ ముల్లంగి శ్రీనివాసరెడ్డి, ఎంపిటిసి సభ్యురాలు వారా సంగీత, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంట పొలాల పరిశీలన

ప్రజాశక్తి - గోకవరం

మండలంలోని గోకవరం, రంపఎర్రంపాలెం గ్రామాల్లో దెబ్బతిన్న వరి పంట పొలాలను శుక్రవారం సహాయ వ్యవసాయ శాఖ సంచాలకులు జయ రామలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇ పంట నమోదు జరిగిందని, కావున పంట నష్టం ఎంత శాతం అనేది నమోదు చేసి రైతులకు నష్ట పరిహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. వర్షాలు వల్ల బాగా దెబ్బతిన్న పంట పొలాల రైతులు గ్రామస్థాయి అధికారులకు ముందస్తుగా కోత కోస్తున్న పంట వివరాలను తెలియచేయాలన్నారు.

తెలుగు మహాసభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం సమీపంలో గైట్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో వచ్చే ఏడాది జనవరి 5, 6, 7 తేదీల్లో నిర్వహించనున్న అంతర్జాతీయ తెలుగు మహ సభలను విజయవంతం చేయాలని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, నన్నయ్య విశ్వవిద్యాలయం విసి కె. పద్మరాజు కోరారు.కళాశాల ప్రాంగణంలో అంతర్జాతీయ తెలుగు మహాసభలకు సన్నాహక సమావేశం ఉపకులపతి ఆచార్య కె. పద్మరాజు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ వచ్చే నెలలో జరిగే మహ సభలకు ఐదు రాష్ట్రాల గవర్నర్లు, నాలుగురు జడ్జిలు, కేంద్ర రాష్ట్ర మంత్రులు హాజరుకానున్నారని తెలిపారు. వీరితోపాటు సినిమా టివి రంగస్థల నటులు, పత్రికా సంపాదకులు తదితర ప్రముఖులు వస్తున్నారన్నారు. అధ్యక్షుడు ఉపకులపతి మాట్లాడుతూ మన భాష, యాస మరిచిపోతున్న ఈరోజుల్లో మన ప్రాచీన భాష గొప్పతనం, సంస్కృతి వెలుగులోకి తీసుకుని రావడం అభినందనీయం అన్నారు. గైట్ కళాశాల ఛైర్మన్ కెవివి సత్యనారాయణరాజు మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో తిరుపతి స్వామి వారి ఆలయం నమూనా తోపాటు దేశం ప్రముఖ తొమ్మిది ఆలయాల నమూనాలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

ఆర్గానిక్ ఫార్మింగ్ ఆకు కూరల విక్రయాలు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



విద్యార్థులు పండించిన ఆకు కూరలను పరిశీలిస్తున్న ప్రిన్సిపల్

స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో బిఎస్‌సి వృక్ష శాస్త్ర విద్యార్థులు సాగు చేసిన ఆర్గానిక్ ఫార్మింగ్ ఆకు కూరలు, కూరగాయాలను విక్రయాలు చేశారు. బిఎస్‌సి వృక్ష శాస్త్రం విద్యార్థులు ఆర్గానిక్ ఫార్మింగ్‌లో భాగంగా అవగాహన మరియు శిక్షణ ఇవ్వడం కొరకు కళాశాలలో 200 గజాల విస్తీర్ణంలో సహజ సిద్దంగా ఎటువంటి రసాయనాలు, ఎరువులు ఉపయోగించకుండా వివిధ ఆకుకూరలు, కూరగాయలు పండించుచున్నారు. శుక్రవారం ఆ ఆకు కూరలు, కూరగాయలను సిబ్బందికి విక్రయించారు. తద్వారా వచ్చిన ఆదాయాన్ని ప్రిన్సిపల్‌కు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత ఆదాయాన్ని పూర్ అండ్ ఫండ్‌లో జమ చేసి పేద విద్యార్థుల కొరకు ఉపయోగించుదామని తెలిపారు.

బత్తుల ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం



బాధితులకు సరుకులు అందిస్తున్న జనసేన నాయకులు

తుపాన్ దాటికి కురిసిన భారీ వర్షాలు, ఈదురు గాలుల వల్ల ముగ్గళ్ల గ్రామం, దాని చుట్టు పక్కల ఉన్న పరిసర గ్రామాలన్నీ లోతట్టు ప్రాంతం అవడంతో జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఇంట్లో నడుము లోతు నీరు నిలిచిపోవడంతో కనీసం ఆహారాన్ని వండుకునే అవకాశం లేకుండా జనం ఇక్కట్లు పడుతు న్నారు. తాగేందుకు నీరు లేక, నిత్యవసర సరుకులు అన్నీ తడిచిపోయి పాడైపోయాయి. భోజనం టిఫిన్ వంటి కనీస ఆహారం లేక చిన్న పిల్లలు, వయో వృద్ధులతో కుటుంబాలన్నీ ఆకలితో అలమటిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో శుక్రవారం జనసేన పార్టీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బత్తుల బలరామకృష్ణ తన బృందంతో వచ్చి 300 మందికి బియ్యం, కూరగాయలు, మంచినీరు, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

బాధితునికి రూ.25 వేల సాయం

ప్రజాశక్తి - యానాం

అనారోగ్యంతో బాధ పడుతున్న స్థానిక కామిశెట్టివారి వీధికి చెందిన అద్దేపల్లి సత్యనారాయణకు సహాయ ఫ్రాన్స్ క్లబ్ సభ్యులు రూ.25 వేలు సమకూర్చి తమ ప్రతినిధి కిషోర్ ద్వారా అందజేశారు. కొల్లాటి సరళ, క్రాంతి, మద్దింశెట్టి జయ, శాంతి, జ్యోత్స్న, జీవాణి, హజిరాఖాన్, లత గల్ల, రాధ జిన్నూవురు, సుష్మా తదితరులు ఈ మొత్తాన్ని సమకూర్చారు. యానాం నుంచి ఫ్రాన్స్ వెళ్లినా తన ప్రాంతాన్ని మరచిపోకుండా ఈ ప్రాంత ప్రజలకు ఏ కష్టమొచ్చినా మేము ఉన్నామని అండగాన నిలుస్తున్న క్లబ్ సభ్యులను స్థానికులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు

ప్రజాశక్తి - గోకవరం



వరి పొలాన్ని పరిశీలిస్తున్న మహబూబ్ వల్లి

సేంద్రియ ఎరువుల పద్ధతి ద్వారా చేసే ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలని, రైతు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఫలితాలను పొందవచ్చునని జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి మహబూబ్ వల్లి అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పండిస్తున్న ప్రకృతి వ్యవసాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రకృతి పద్ధతిలో వ్యవసాయం సాగు చేస్తే నేల సారావంతం పెరిగి పంటకు బలం చేకూరుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రగడ వెంకట సాయి గౌతమ్, రామకృష్ణ, ఏగుల దేవి, ఇల్లపు శివసోమేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు విద్యార్థులు చేయూత



వృద్ధులకు నిత్యవసరాలు అందిస్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

నగరంలోని గౌతమీ జీవకారుణ్య వృద్ధాశ్రమంలోని నిరాశ్రయులకు ఆర్ట్స్ కళాశాల జంతుశాస్త్రం విభాగం విద్యార్థులు చేయూతనందించారు. ఉత్తమ ఆచరణ పద్ధతిలో భాగంగా వారికి పండ్లు, బిస్కెట్లు, బియ్యం, పప్పు, ఇతర నిత్యవసర సరుకులు అందించి తమ సేవా గుణాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో జంతుశాస్త్ర విభాగాధిపతి కె.దుర్గారావు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి రైతుకు నష్ట పరిహారం అందిస్తాం

ప్రజాశక్తి - తాళ్లపూడి



పంట పొలాన్ని పరిశీలిస్తున్న అధికారి మాధవరాఉ

పంట నష్టపోయిన రైతులందరికీ నష్ట పరిహారం అందిస్తామని వ్యవసాయ శాఖ అధికారి ఎస్ మాధవరావు అన్నారు. మండలంలో నీట మునిగిన పంట పొలాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. రైతుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నష్ట సాయాన్ని త్వరితగతిన అందించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చిన వెంటనే పంట నష్ట పరిహారాన్ని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో సహాయ వ్యవసాయ సంచాలకులు పి చంద్రశేఖర్, ఎఒ రుచిత, విఎఎ.భార్గవ్ సాయి పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌తో రోగాలు తప్పవు



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్

ప్రజాశక్తి - కడియం

సెల్ ఫోను ప్రపంచాన్ని చేతిలోకి తీసుకురావడమే కాదు, సరిగా ఉపయోగించకపోతే అధికంగా రోగాల్ని ఒంట్లోకి తీసుకొస్తుందని నిజాం ఇనిస్టిట్యూట్ ఫిజియో థెరపిస్ట్ ఎ.సంతోష్ కుమార్ అన్నారు. స్థానిక ఎంపిపి కార్యాలయంలో శుక్రవారం హెచ్‌ఎంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక గంటలోపు మాట్లాడితే ప్రమాదం 50 శాతం తగ్గుతుందని అన్నారు. ఫోన్‌ను కనీసం 6 అడుగుల దూరంలో ఉంచాలన్నారు. రాత్రి సమయాలలో తలదగ్గర పెట్టి పడుకుంటే బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధులు వస్తాయన్నారు. ఎక్కువగా ఫోన్ వాడితే మెడకు సంబంధించిన సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ లజపతిరాయ్, వీరభద్రరావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.